క్లుప్తంగా

22న మండల సమావేశం

పీసీపల్లి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 22న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఆర్ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ఎంపీపీ అత్యాల జపన్య అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు హాజరుకావాలని ఎంపీడీఓ కోరారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో అందరికీ వైద్యం



చెంచయ్యకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

జరుగుమల్లి: గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఒక్కరికీ వైద్య సేవలు అందించాలన్నదే ఫ్యామిలీ డాక్టర్ లక్ష్యమని వైద్యాధికారి డాక్టర్ లీనా రాఫెల్ అన్నారు. నర్సింగోలులో శనివారం పలువురిని పరీక్షించారు..దేశంలో ఎక్కడా లేనటు వంటి ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సీఎం జగన్ మోహనరెడ్డి రాష్ట్రంలో అమలు చేస్తున్నారన్నారు. ఎంఎస్‌హెచ్‌పీ లక్ష్మి, ఏఎన్ఎం పద్మలత, సూపర్‌వైజర్ చంద్రశేఖర్, డీఈఓ స్వాతి పాల్గొన్నారు.

తీరిన విద్యుత్ సమస్య



విద్యుత్ లైన్ కు మరమ్మతులు చేస్తున్న ఏఈ

పీసీపల్లి: కొద్దిపాటి వర్షానికి రెండు రోజుల పాటు విద్యుత్ నిలిచిపోవడంతో పీసీపల్లి ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. స్పందించిన విద్యుత్ ఏఈ లక్ష్మీ ప్రసన్న స్వయంగా రంగంలో దిగి సిబ్బందితో కలసి సమస్యను పరిష్కరించారు. దీంతో విద్యుత్ సమస్య తీరింది.

పాల ఆటో బోల్తా.. యువతికి గాయాలు



తిరగబడిన ఎలక్ట్రిక్ ఆటో

జరుగుమల్లి: ఆటో తిరగబడి మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన జరుగుమల్లిలోని ఇటుక రాయి బట్టీల వద్ద శనివారం తెల్లవారు జామున జరిగింది. ఒంగోలు నగరానికి చెందిన నాయుడు మాధవీలత పాల క్యానులు కోసం జరుగుమల్లిలోని డైయిరా ఫాంకు వచ్చింది. పాలు తన విద్యుత్ ఆటోలో ఎక్కించుకొని ఒంగోలు వెళుతుండగా జరుగుమల్లి ఇటుక రాయి బట్టీల వద్దకు రాగా ఆటోకి కుక్కలు అడ్డువచ్చాయి. దీంతో యువతి సడన్ బ్రేక్ వేయడంతో వాహనం తిరగబడి సైడు కాలువలోకి వెళ్ళింది. ఆమె కాలికి తీవ్ర గాయాలయ్యాయి. 108లో ఒంగోలు తరలించారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే, ఎన్జీరంగా వర్శిటీ బోర్డ్ మెంబర్ బుర్రా మధుసూదన్ యాదవ్



కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బుర్రా

కనిగిరి రూరల్: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే, ఎన్జీ రంగా వ్యవసాయ విద్యాలయం బోర్డ్ మెంబర్ బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. స్థానిక వైఎస్సార్ భవనలో షెడ్యూల్ సహకార సంస్థ ఒంగోలు ఆధ్వర్యంలో ప్రకృతి వ్యసాయం చేసే ఎస్సీ రైతులకు రూ.10 వేల విలువైన కిట్లను శనివారం ఉచితంగా ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ రైతు అభివృద్ధికి అనేక పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. రైతు భరోసా కేంద్రాల ద్వార రైతులకు ఎంతో మేలు చేకూర్చినట్లు చెప్పారు. ప్రకృతి వ్యసాయ పద్ధతులను అందరూ పాటించాలని పిలుపునిచ్చారు. భూమిలో సారవంతాన్ని పెంపొందించేందుకు ఉపయోగపడే ప్రకృతి వ్యవసాయ కిట్లను అందరూ వినియోగించాలన్నారు. వీటి ద్వారా భూమిలో సత్తువ పెరుగుతుందని, తద్వార భూ సారవంతంగా మారుతుందన్నారు. ఏడీఏ వెంకట రమణ మాట్లాడుతూ పకృతి వ్యవసాయ పద్ధతుల అవలంబిస్తే రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ప్రధాన పంటకు మేలు, దిగుబడి పెంపుదలకు దోహదపడుతుందని వివరించారు. కిట్లతో పాటు టార్పాలిక్ పట్టాలు, పాస్టిక్ డ్రమ్స్‌లు ఇస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు సీహెచ్ సాల్మన్, మాజీ ఎంపీపీ గాయం బలరాంరెడ్డి, వైస్ ఎంపీపీ లక్కిరెడ్డి తిరుపతిరెడ్డి, అబ్రహం లింకన్, పిల్లి లక్ష్మీ నారయాణరెడ్డి, ఎస్‌కే జిలానీ, జానీ, వేల్పుల వెంకటేశ్వర్లు, దాసరి మురళీ, బేతం శెట్టి జంగమయ్య నాయుడు, చమ్మిడి శెట్టి శ్రీనివాసుల నాయుడు, ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ డి.దివ్యరాణి, రైతులు పాల్గొన్నారు.

ఉప ఎన్నికలు ప్రశాంతం



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ శోభిక



సీఎస్‌పురంలో ఎన్నికలను పర్యవేక్షిస్తున్న అధికారులు



పందువ 4వ వార్డులో గెలుపొందిన మరియమ్మ

కందుకూరు: నియోజకవర్గంలో జరిగిన ఉప ఎన్నికల ప్రశాతంగా ముగిసింది. మొత్తం నాలుగు మండలాల్లో నాలుగు వార్డులకు ఉప ఎన్నికలు జరగ్గా రెండు చోట్ల వైఎస్సార్ సీపీ మద్దతుదారులు, మరో రెండు స్థానాలు తెలుగుదేశం పార్టీ మద్దతుదారులు విజయం సాధించారు. వీటిలో గుడ్లూరు మండలంలోని చేవూరు 1వ వార్డు నుంచి వైఎస్సార్ సీపీ మద్దదారుడు ఉప్పు వెంకటేశ్వర్లు, కందుకూరు మండలం జిల్లెలమూడి పంచాయతీ పరిధిలో 6వ వార్డు నుంచి వైఎస్సార్ సీపీ మద్దదుదారుడు వి.మహేంద్ర ఏగ్రీవంగా ఎన్నికైయ్యారు. ఎన్నికలు జరిగిన ఉలవపాడు మండలంలోని ఆత్మకూరు పంచాయతీ 5వ వార్డు ఉప ఎన్నికలో టీడీపీ మద్దతుదారుడు చిరుతోటి కోటేశ్వర రావు, లింగసముద్రం మండలం చినపవని పంచాయతీలోని 6వ వార్డు ఎన్నికలో టీడీపీ మద్దతుదారు పారా కోటేశ్వరమ్మ విజయం సాధించారు.

ఉలవపాడు: మండల పరిధిలోని ఆత్మకూరులో 5 వార్డు సభ్యుని ఎన్నిక ప్రశాంతంగా జరిగింది. ఈ ఎన్నికలో చిరుతోటి కోటేశ్వరరావు, మెండా శ్యామల పోటీపడ్డారు. మొత్తం 156 ఓట్లకు గాను 127 ఓట్లు పోలయ్యాయి. అందులో చిరుతోటికోటేశ్వరరావుకు 64 ఓట్లు, మెండా శ్యామలకు 62 ఓట్లు రాగా నోటాకు 1 ఓటు పడింది. దీంతో చిరుతోటి కోటేశ్వర రావు 2 ఓట్లతో గెలుపొందినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఎన్నికల తీరును కందుకూరు సబ్‌కలెక్టర్ శోభిక పరిశీలించారు. ఎలాంటి అవాంఛీయ సంఘటనలు జరగకుండా సీఐ నఫీజ్‌బాషా, ఎస్సై బాజిరెడ్డిలు బందోబస్తునిర్వహించారు.

గుడ్లూరు: మండలంలోని చేవూరు 1వ వార్డు అభ్యర్థి ఉప్పు వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నిక అయినట్లు ఎన్నికల అధికారి గోవర్ధన్ తెలిపారు. గ్రామంలోని 1వార్డుకు ఉప ఎన్నికకు నోటిఫికేషన్ ఇవ్వగా వైఎస్సార్ సీపీ బలపరిచిన ఉప్పు వెంకటేశ్వర్లు ఒక్కరే నామినేషన్ వేయడంతో అతను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి గోవర్ధన్ తెలిపారు. ఉప్పు వెంకటేశ్వర్లుకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో డిక్లరేషన్ ఫారం అందచేశారు.

పీసీపల్లి: మండల పరిధిలోని గుంటుపల్లి 3 వార్డుకు జరిగిన ఎన్నికల్లో వడ్డె చిన్నమ్మ 22 ఓట్ల మెజార్టీతో గెలుపొందింది. బరిలో ముగ్గురు అభ్యర్థులు నిలవగా వడ్డె చిన్నమ్మకు 73 ఓట్లు, మిగతా ఇరువురికి 51, 47 ఓట్ల చొప్పున వచ్చాయి.

సీఎస్‌పురం (పామూరు): మండలంలోని చెన్నపునాయునిపల్లె గ్రామ పంచాయతీ 6వ వార్డుకు శనివారం నిర్వహించిన ఉపఎన్నిక ప్రశాంతంగా ముగిసింది. ఎన్నికలను ఎంపీడీఓ ఈశ్వరమ్మ, ఎన్నికల అధికారి సయ్యద్ ఇసాక్‌లు పర్యవేక్షించగా ఎస్సై పి.అనిల్‌కుమార్ బందోబస్తు నిర్వహించారు. వార్డులో మొత్తం 122 ఓట్లు ఉండగా 107 ఓట్లు పోలయ్యాయి. మొత్తం ఎన్నికల బరిలో 5 మంది డగా యనమల వెంకట నాగరాజు 4 ఓట్ల మెజారిటీతో గెలుపొందాడు. నాగరాజుకు 54 ఓట్లు, షేక్.గౌస్‌కు 50 ఓట్లు వచ్చాయి.

వెలిగండ్ల: మండలంలోని పందువ పంచాయితీ 4వ వార్డుకు ఉప ఎన్నిక శనివారం జరిగింది. 4వ వార్డులో మొత్తం 187 ఓట్లు ఉండగా 131 ఓట్లు పోలయ్యాయి. 70.05 శాతం పోలింగ్ జరిగింది. టీడీపీ బలపరిచిన అభ్యర్థి కుమ్మరికుంట జోసఫ్‌కు 63 ఓట్లు రాగా, వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి కుమ్మరికుంట మరియమ్మకు 64 ఓట్లు వచ్చాయి. ఒక ఓటు మెజర్టీతో వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థి మరియమ్మ గెలుపొందారు. మిగిలిన నాలుగు ఓట్లు చెల్లుబాటు కాలేదు. టీడీపీ మద్దతు అభ్యర్థిని గెలిపించుకునేందుకు ఆ పార్టీ నాయకులు మందు, డబ్బుతో ప్రలోభపెట్టారు. కానీ ఓటర్లు మాత్రం వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థికే పట్టం కట్టారు. ఎన్నికల ప్రత్యేకాధికారి టి.సుకుమార్, పీఓ రామకృష్ణారెడ్డి, ఆర్‌ఓ మనోహర్, ఏపీఓ ఆదినారాయణ, అశోక్, సీనియర్ అసిస్టెంట్ ఖాదర్‌బాషా, పంచాయతీ కార్యదర్శి సుధాకర్ పాల్గొన్నారు. వెలిగండ్ల, పామూరు ఎస్సైలు మహేష్‌కుమార్, సురేష్,ప్రత్యేక బందోబస్తు చర్యలు చేపట్టారు.

కనిగిరి రూరల్: కనిగిరి మండలంలోని రెండు పంచాయతీల్లోని రెండు వార్డుల్లో ఉప ఎన్నికలు జరగాయి. వాటిలో వంగపాడు పంచాయతీలోని 6వ వార్డు ఉప ఎన్నికలో పాతగుంట మనోజ్ఞ ఏకగ్రీవం అయ్యారు. అలాగే గురువాజీపేట పంచాయతీ 2వ వార్డుకు శనివారం ఎన్నికలు జరగ్గా, అందులో రెక్కల సుశీల 27 ఓట్ల మెజార్టీతో గెలుపొందినట్లు ఎన్నికల అధికారులు జేవీబీ మల్లికార్జున రావు, యువీ నారయాణరెడ్డి తెలిపారు. సీఐ శివరామకృష్ణారెడ్డి పర్యవేక్షణలో ఎస్సై దాసరి ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

సింగరాయకొండ: మండలంలో శనివారం జరిగిన ఉప ఎన్నికల్లో సింగరాయకొండ పంచాయతీ 16వ వార్డు వైఎస్సార్ సీపీ అభ్యర్థి షేక్ సాబీరా 262 ఓట్ల భారీ మెజారిటీతో జనసేన పార్టీ అభ్యర్థి షేక్ షకీలపై గెలుపొందారు. పాకల సర్పంచ్ పదవికి టీడీపీ అభ్యర్థి సైకం చంద్రశేఖర్ 249 ఓట్ల మెజారిటీతో, మూలగుంటపాడు 10 వార్డు అభ్యర్థి అంబటి శ్రీనివాసులు 63 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.

ముగిసిన వార్డు ఎన్నికలు

టంగుటూరు: మండలంలో వార్డు ఎన్నికలు శనివారం ప్రశాంతంగా ముగిశాయి. వాసేపల్లిపాడు ఏకగ్రీవం కాగా, కందులూరులో ఇద్దరు నామినేషన్లు వేయగా ఒకరి విరమించుకున్నారు. పొందూరులో టీడీపీ అభ్యర్థి చింతపల్లి శ్రీనివాసుల మీద టీడీపీ రెబల్ అభ్యర్థి పిడికిటి శ్రీనాథ్ 67 ఓట్ల మెజారిటీతో గెలుపొందాడని ఎంపీడీఓ రత్నజ్యోతి తెలిపారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న డీఎస్పీ రామచంద్ర

కందుకూరు: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని డీఎస్పీ రామచంద్ర అన్నారు. పట్టణంలోని శ్రీరామ్‌నగర్‌లో శనివారం యువతకు మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల ప్రవర్తన పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. పిల్లల ప్రవర్తనలో విపరీతమైన మార్పులు గమనిస్తే వెంటనే పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. ప్రధానంగా గంజాయి లాంటి మత్తు పదార్థాలకు పిల్లలు బానిసలు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గంజాయిని వినియోగించినా, కలిగి ఉన్నా, రవాణా చేసినా చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. పేకాట, కోడిపందాలు వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినా లేదా రోడ్ల వెంట ర్యాగింగ్‌కు పాల్పడిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే కాలనీల్లో బెల్టుషాపులు నిర్వహించి మద్యం విక్రయించడం నేరమన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు యువత దూరంగా ఉండాలని సూచించారు. పట్టణ ఎస్సై హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజ స్తంభ ప్రతిష్ఠ



స్వాములవారి కళ్యాణంలో భక్తులు



గుండ్లసముద్రంలో రాతి ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న దృశ్యం

మద్దిపాడు: మండలంలోని గుండ్లసముద్రంలో గ్రామస్తులు సహాయ సహకారంతో సుమారు 40 అడుగుల వీరాంజనేయస్వామి రాతి ధ్వజప్రతిష్ఠా మహోత్సం శనివారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు బరూరి శివసుబ్రహ్మణ్య శాస్త్రి ఆధ్వర్యంలో వేదపండితుల మాత్రోచ్ఛరణల మధ్య కార్యక్రమం జరిగింది. స్వాములవారిని ప్రతిమలను ఊరేగించారు.

బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు



తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఐసీడీఎస్ అధికారులు

పామూరు: బాల్యవివాహాలు చేస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ, మహిళాపోలీస్ త్రివేణి అన్నారు. మండలంలోని బోడవాడలో బాల్యవివాహాలు నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఐసీడీఎస్, మహిళాపోలీస్, ఎన్‌జీఓ బోడవాడ గ్రామానికి వెళ్లి బాల్య వివాహాలు తలపెట్టిన రెండు కుటుంబాలు దొడ్డా యలమంద, బత్తుల బలరామయ్య కుటుంబసభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. వివాహ వయస్సు బాలికలకు 18 ఏళ్ల, బాలురకు 21 ఏళ్ల నిండాలన్నారు. నిర్దేశిత వయసు కన్నా తక్కువ వారికి వివాహం చేస్తే అటు జైలుశిక్షతో పాటు, జరిమానా విధిస్తామన్నారు. తక్కువ వయసులో వివాహాలు చేస్తే అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. ఎక్కడైనా బాల్యవివాహాలు జరుగుతున్నట్లు సమాచారం ఉంటే పోలీసులకు లేదా 1098 హెల్ప్‌లైన్ నంబర్‌కు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో స్వయంకృషి స్వచ్ఛందసేవాసంస్థ అధ్యక్షుడు షేక్.నాయబ్‌రసూల్, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన అవసరం



మాట్లాడుతున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: స్త్రీలు, బాలికలు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్గి ఉండాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక ఎమ్మెస్సార్ బాలికల జూనియర్ కళాశాలలో న్యాయ సేవాధికార సంస్థ, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ సమాజంలో ఆడపిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాల బాలికల్లో చైతన్యం ఉండాలన్నారు. మంచి స్పర్శ, చెడు స్పర్శల గురించి కనీస మేల్కొల్పు కల్గి ఉన్నప్పుడే లైగింక వేధింపుల నివారణకు పిల్లల్లో చైతన్య వస్తోందన్నారు. ఎప్పుడైనా ఎక్కడైనా లైంగిక వివక్షకు గురవుతున్నట్లు భావిస్తే టోల్ ఫ్రీ నంబర్ 112కు కాల్ చేయాలని తెలిపారు. వివిధ సంస్థల ప్రతినిధులు కిరణ్, మంద్రు రమేష్, నవకుమార్, సేవాధికార సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కందుకూరు: విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ టీవీ నరసింహం తెలిపారు. సీటీర్ఐ, తహసీల్దార్ కార్యాలయాల పరిధిలోని ఫీడర్‌ల పరిధిలో విద్యుత్‌లైన్‌కు అడ్డంగా ఉన్న చెట్టు కొమ్మలు తొలగించేందుకు ఈ రెండు ఫీడర్‌ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. సంతోష్‌నగర్, మక్కా మసీదు స్ట్రీట్, తహసీల్దార్ కార్యాలయం ఏరియా, పాత బ్యాంకు బజార్, వెంకటనారాయణ బజార్, మోర్ సూపర్‌మార్కెట్ ఏరియా, ఎస్‌బీఐ బ్యాంకు, వాసవీనగర్, వాసవీనగర్, ప్రకాశం కాలనీ, రెవెన్యూ కాలనీ, సీటీఆర్ఐ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8.30గంటల నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

1920 బేళ్ల కొనుగోలు

కందుకూరు: కందుకూరులోని రెండు వేలం కేంద్రాల్లో శనివారం జరిగిన పొగాకు వేలంలో 1920 బేళ్లను విక్రయించారు. వీటిలో కందుకూరు–1వ వేలం కేంద్రం 1229 బేళ్లను వేలానికి ఉంచగా 1140 బేళ్లు, కందుకూరు–2లో 856 బేళ్లను వేలానికి ఉంచగా 780 బేళ్లు విక్రయించారు. రెండు వేలం కేంద్రాల పరిధిలో కేజీ పొగాకు అత్యధిక ధర రూ.272, రూ.273 వచ్చాయి. అత్యల్ప ధరలు రూ. 160, రూ.167 వచ్చాయి.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం



రైతులకు కిట్స్ పంపిణీ చేస్తున్న ప్రకృతి వ్యవసాయాధికారి వెంకట్రావు

టంగుటూరు: ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం వస్తుందని వక్తలన్నారు. ఎం.నిడమనూరులో రైతు సాధికార సంస్థ ఆంధ్రప్రదేశ్ ప్రకృతి వ్యవసాయ కమిటీ ఆధ్వర్యంలో ఎస్సీ రైతులకు శనివారం రూ.10 వేల విలువైన కిట్లను రైతులకు ప్రకృతి వ్యవసాయాధికారి వెంకట్రావు పంపిణీ చేశారు. ఐసీఆర్పీ శృతి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా పండించిన ఆకుకూరలు, కూరగాయలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని, గ్రామంలో ప్రతి ఒక్కరూ తమ ఇంట్లో కిచెన్ గార్డెన్‌ను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం చేసేందుకు రైతులు ముందుకు వస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు గ్రామ అడ్వైజరీ బోర్డ్ చైర్మన్ వల్లంరెడ్డి రమణారెడ్డి, మెంబర్ ఏ.శ్రీనివాసరెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు సుభాషిణి, ప్రకృతి వ్యవసాయాధికారి ఎల్1 వెంకట్రావు, ఎల్2 విజయలక్ష్మి, ఐసీఆర్పీలు సుజాత, మరియమ్మ, జ్యోత్స్న, హరిత, గ్రామ రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ మోటార్లలో వైరు చోరీ

గుడ్లూరు: పొలాల్లో ఉన్న మోటార్లలోని విద్యుత్ వైరు చోరీకి గురైన సంఘటన కొత్త పేట దగ్గరలో ఉన్న ఉత్తర పొలాల్లో శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే..గుడ్లూరుకు చెందిన గిరి,బాబు ఇద్దరు రైతులు ఉత్తర పొలంలో ఉన్న తమ మామిడి తోటలు దగ్గరకు శనివారం ఉదయం వెళ్లగా అక్కడ వారికి చెందిన ఆరు విద్యుత్ మోటార్లకు ఉన్న విద్యుత్ వైరు అపహరణకు గురైనట్లు గుర్తించారు. శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దొంగలు చోరీ చేసి ఉంటారన్నారు. చోరీకి గురైన విద్యుత్ వైరు విలువ సుమారు రూ. 30 వేలు ఉంటుందని బాధిత రైతులు వాపోయారు.

లావణ్య భౌతికకాయానికి నివాళులర్పించిన గుంటక



లావణ్య భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ తిరుపతిరెడ్డి

వెలిగండ్ల: గుడిపాటిపల్లి పంచాయితీ 5వ వార్డు సభ్యురాలు గోనా లావణ్య మృతి వైఎస్సార్ సీపీకి తీరని లోటని జెడ్పీటీసీల జిల్లా అధ్యక్షుడు గుంటక తిరుపతిరెడ్డి అన్నారు. గోనా లావణ్య అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ గుంటక తిరుపతిరెడ్డి లావణ్య భౌతికకాయాన్ని సందర్శించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబానికి సంతాపాన్ని తెలియచేశారు. లావణ్య భర్త గోనా సారోన్‌కు ధైర్యం చెప్పి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈయన వెంట సర్పంచ్ కటికల రిబ్కా, ఎంపీటీసీ సభ్యులు నాగేశ్వరరావు, నాయకులు కటికల వెంకటరత్నం, ఉపాధ్యాయులు వీఎస్ ఫిలిక్స్, గోనా లక్ష్మయ్య, వార్డు మెంబర్ అశోక్, దేవదానం, తిరుపాల్ పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బుర్రా

హనుమంతునిపాడు: మండలంలోని దాసరిపల్లి, కొండారెడ్డిపల్లి గ్రామాల్లో జరిగిన రెండు వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ పాల్గొన్నారు. శనివారం దాసరిపల్లిలో మూరబోయిన పెండ్లి వేడుకల్లో, కొండారెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ కలుకూరి దేవకరణమ్మ కుమారుడు శేఖర్ పెండ్లి వేడుకల్లో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. మండల కన్వీనర్ యక్కంటి శ్రీనివాసులరెడ్డి, మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి, యూత్ అధ్యక్షుడు భవనం క్రిష్ణారెడ్డి, ప్రచార కమిటీ అధ్యక్షుడు డి.పిచ్చిరెడ్డి, షేక్ మౌలాలీ, ఆదినారాయణ, చిన్న, నారాయణరెడ్డి ఉన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన



పథకాల లబ్ధిబుక్‌లెట్‌ను అందచేస్తున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్

● ఎమ్మెల్యే బుర్రామధుసూదన్ యాదవ్

కనిగిరి రూరల్: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పరిపాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. పీసీపల్లి మండలంలోని మురిగమ్మి సచివాలయం పరిధిలోని జంగాలవారిపల్లిలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ పార్టీల కతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందచేస్తున్నట్లు తెలిపారు. అర్హతే ప్రామాణికంగా ప్రతి లబ్ధిదారునికి నేరుగా లబ్ధి చేకూర్చేలా సచివాలయ వ్యవస్థద్వార పారదర్శక పాలన సాగిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం అందించిన నవరత్నాల పథకాలతో ప్రతి ఇంటిలో రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు మేలు జరిగిందని వివరించారు. టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీల పేరితో తీవ్ర అక్రమాలకు పాల్పడ్డారని విమర్శించారు. పచ్చ చొక్కాల వారికే సంక్షేమ పథకాలు అందేవన్నారు. కానీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హతే ప్రమాణికంగా ప్రభుత్వ ఫలాలు అందచేస్తున్నామన్నారు. సంక్షేమ పథకాలతో దేశంలో ఆదర్శ ముఖ్యమంత్రి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిలిచారని కొనియాడారు. ఎమ్మెల్యే బుర్రా ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. గడప గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి, పథకాల లబ్ధి బుక్‌లెట్‌ను అందచేశారు. తొలుత చెరుకూరి సతీష్ చౌదరి, ఒకే రెడ్డి, జి. బొర్రారెడ్డి, గుర్రం మాల్యాద్రి చౌదరి, శీలం సుదర్శన్, కసిరెడ్డి రామిరెడ్డి, కసిరెడ్డి ఓబులరెడ్డి, నాగిరెడ్డి, సంగటి కోటిరెడ్డి, మోహన్‌రెడ్డి, నాగేశ్వరరావులు ఎమ్మెల్యే బుర్రాకు స్వాగతం పలికి, ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బత్తుల అంజయ్య, యర్రంరెడ్డి మోహన్‌రెడ్డి, కొండారెడ్డి, నలగండ్ల శ్రీను, వల్లి మాల్యాద్రి, పులి రవి, మోహన్‌రెడ్డి, మేకల మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.